# కాందిశీకుని జీవితంలో....

*   శ్రీ చింతా శ్రీరామచంద్రమూర్తి   *

దాసు సముద్రంలా తయారయ్యాడు. భోరున ఏడుస్తున్నాడు. దాదా ఫక్కున నవ్వాడు. ఆ ఏడ్పుల వాతావరణంలో దాదానవ్వు ఒక్కటే కలవరింత.

"హిఁ...హి...హిఁ... నా జీజీ నా పాపా... హిఁ హిఁ హిఁ అదుగో, అదుగో...ఇన్నాళ్ళెక్కడికెళ్లారు దాదా?" దాసు ఆ ప్రశ్న అడుగుతూ మళ్లా ఫక్కున నవ్వాడు. ఆ చీకటిలో ఆ గంభీరమైన నవ్వు తెల్లగా కనుపించదు.

దాదా అన్నాడు.

"ఇంకా నీవాళ్ళకోసం...?"

ప్రవాహవేగంలో కెరటాల శబ్దాలు వినిపించటం లేదు. దాసు ఆ కొండల్లో పరుగులు పెట్టాడు. దాదా గొంతెత్తి అరచాడు.

"ఆగు దాసూ...సర్పాలు...పాములు... లోయలు...అఖాతాలు...మిట్టపల్లాలు...ఎక్కడికి పరుగులు?"

దాదా కేకలు అతనికి వినిపించటంలేదు.

దాదా సగర్వంగా అన్నాడు.

"మెరుపు మేఘాల్లో విప్లవం. మెరుపులో మెరుపుదయిస్తే ప్రకృతిలో ఎంత క్రాంతి?"

తనకోసం నిర్మించిన మానవజగత్తులో దాసుకు వినవచ్చే సందేశా లెట్లాంటివి?

ఆ అచంచల విశ్వంలో గులకరాళ్ళ గుల్ల శబ్దాలు బ్రతుకుతూన్న నిట్టూర్పులు. ఆ నిస్తబ్ద జగత్తులో అజీవకాలు తమలోమూల్గుతూన్న గాలుల జీవన రవాలు.

దాదా తనలో అనుకున్నాడు.

జగత్తులో ఏది మిథ్య. బ్రతకటంతప్ప యింకేమైనా అవ్వచ్చు.

దాసు తనలో అనుకున్నాడు.

జగత్తులో ఏది శాశ్వతం. బ్రతకటంతప్ప యింకేమయినా శాశ్వతాలే.

దాసు ఏడుస్తున్నాడు చిన్న పిల్లాడిలాగ.

"నే నెందుకు పుట్టాను! అందులో బీదవాడినై. పుట్టి పెరగటం దేనికి? పెరిగి పెండ్లాడటం......

దాదా జ్ఞాపకం చేశాడు.

"అదుగో ఆ వెలుగును చూశావా? నీళ్లులేక, గాలిలేక శూన్యమయి యీ రాతిలో యీ చెట్టెందుకు మొలిచింది? దానికి మొలవమని యెవ్వరు చెప్పారు?"

దాసు లేచి పరుగెత్తాడు. బోర్లా పడుక్కొని ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాడు. ఆ ఏడ్పులో నవ్వుతున్నాడు.

"అబ్బా! ఎంత పెద్దది యీ మహా విశ్వం, అందులో ఎన్ని జనన మరణాలు. అందులో ఎన్ని సుఖదుఃఖాలు. తన బాధలు మరిచే శక్తి లేనప్పుడు, మరవడానికి సంబంధ బాంధవ్యాలు కల్పించుకోనాలన్న ఒక వెర్రి ఒకపిచ్చి తనకెందుకు పుట్టింది? ఆ మహా ప్రస్థానంలో ప్రేమకోసం, ఒక మధురకరమయిన సంబంధంకోసం, తమ బాధలు మరవడానికి, తన అనుభవాలు పంచడానికి, తన అభినయాలు వ్యక్తం చెయ్యడానికి ఆమెకోసం వెతికాడు. ఆమె ఎందుకు వప్పుకుంది తనకూడా రావడానికి? ఈ సంబంధాల అంతర్యం ఏమిటి? ఆమె వచ్చింది. తన జీవితంలో పొగలా వ్యాపించిన మంచుని, శక్యం కాని బాధని, తన చేతుల నమ్రతతో, తన వేళ్ళకొనల మెత్తతనంతో, హృదయపు నైగనిగ్యంతో ఎంత సులువుగా నెట్టింది? అయినా యిప్పటికష్టం అంతా సంఘానిది. సమాజానిది. వెధవది. తప్పంతా సమాజానిది."

దాదా జ్ఞాపకం చేశాడు.

ప్రపంచం అనుక్షణమూ మారుతూనే వుంటుంది. సంఘం పెద్దలునిర్మించారు. ఆ నీతిశాస్త్రాల్లో ఏదీ తన యీనాటి బాధతో సంబంధం లేనిది."

దాసు మళ్ళా మొదలుపెట్టాడు. వేదనలో రోదన. ఆ నిశాంత నిశ్శబ్దంలో అది ఛేదన. ఆవిరిలో పొగలా, మరిగే నీటిలో బుడగల ప్రలాపన అది.

"సంఘం. హిఁ—హిఁ—హిఁ. ఎందుకు సంబంధంలేదు. పనులు చూపెట్టమని బ్రతిమాలితే యివ్వక యివ్వక యిచ్చిన భాగ్యవంతులు. వాళ్ళిచ్చే జీతంతో ప్రపంచంలో బ్రతుకుదామన్నా సరిపోదు. సరిపోయినా తనకి పెట్టిన బాధలు, కొట్టిన దెబ్బలు,

పోనీ తను తిన్నా అంతబాధ వుండదు. తన జీజీని, స్త్రీని, వా డెంతగా చావమోదాడు ఆ హృదయం— చచ్చేలా మోదాడు. పోనీ చచ్చిపోతున్నామంటే కానీ యిస్తారా? చచ్చిపోండి తరువాత దహనం చేయిస్తాం అంటారు...కానీ దానికీ యిష్టంలేక పాతేంచేస్తారు...పాతేంచేస్తారు. నక్కలుకుక్కలు. దానితోటే విదేశానికి ప్రయాణమయ్యాడు ఆ వెన్నెలలో...అబ్బ! ఎంత మధురమయిన రాత్రి. ఓడ కూస్తూంటే, పొగమేఘాల్లా తయారవుతూంటే అందాల దొంతర్ని అనుభవించిన జీజీ హృదయం ఎంత మధురంగా, తియ్యగా ఉంది. ఆ ఎర్రటి ప్రదిమల్లో ప్రతిబింబించిన నవ్వు తన కష్టాల్ని మరచేట్టు చేసిందికదూ? అయితే యిక్కడ జరిగిందేమిటి? రబ్బరుబూరాలో వూదిన గాలి ఎంతకాలం వుంటుంది? మళ్లా శూన్యమయింది బ్రతుకు—...”

దాదా అన్నాడు.

“అద్దంలో ప్రతిచిత్రాలు మారుతూనట్లు మీ జీవితఃపరిశ్రమలుమారినై. ఎవ్వరినంటావు యిందులో ఏకష్టాన్నయితే జపించడానికని, సుఖాన్ని సంపాదించేవో ఆ సుఖంతోటే కష్టం నీడలా తరిమిందినిన్ను నీదేశంలో దొరికింది నీవుతినక పరదేశ ప్రయాణాలెందుకు?. ఏ ఆశలో అవకాశాన్ని నిర్మించాలో అందులోనే నిరాశ. కష్టంలో వుట్టడం నీ కర్మ”

దాసు విస్మయంగా నవ్వాడు.

“హీఁ హీఁ. కర్మ. అంటే? మానవుడు తన స్వలాభంకోసం, పీడన కోసం నిర్మించిన పదం అది. ఇతరుల్ని మోసగించడానికి వుపయోగిస్తారు ఆ పదం కాదు. తను చాలాసార్లు సుఖాన్నే అనుభవించాడు. అది ఎంతమంచిరాత్రి. జీజీ ఎంత పల్లవితంగా మాట్లాడింది? ఎంతదీనంగా విలపించింది? మీకు అబ్బాయి పుడతాడు, ఏంతెస్తారు? మీ అబ్బాయికి ఏంపేరెడుతారు? చెప్పండి. మీలాగే. మీ అబ్బాయీ బాగా పాడతాడు శాస్త్రయుక్తంగా పాడతాడు. రోజా బియ్యంతెస్తాడు. వాడిపొట్ట వాడే పోసుకుంటారు. మనల్ని ఏమీ బాధపెట్టడు. శత్రువులు—అబ్బా! శత్రువులు వస్తారుట. మనల్ని ఏమీ చెయ్యకుండా



మనదేశం చేరుకుందాం. ఏమయినా బంగారంపండే భరతదేశం మంది. తెల్లాళ్లు మూర్ఖులు. హింసించటం తప్పయింకోటి తెలీదు వాళ్లకి. ఈ మాటలంటూంటే "జీజీ" కళ్లు అశ్రు ఖండాలయినాయి. ఆమెచలిలా వణికింది. మంచులా మణుచుకు పోయింది. అప్పుడు తన యీ చేతుల్తోటే ఆమెను కౌగలించుకున్నాడు. స్వదేశం వచ్చేస్తున్నట్లు కలలుగన్నాడు. ఆ రాత్రిలో ఎన్ని యదార్థాలు జరుగుతాయనుకున్నాడు.— కాని, ఆ కలలో భూమి బ్రద్దలయ్యింది. ఆ చీకటిలో నాజీజీ నా ప్రాణాలుఅణగిపోయాయి. వారిఏడ్పులు వారినవ్వులు అన్నీ భూగర్భంలో దాక్కున్నాయి. ఏమయినా జీవితం చనిపోతుంది. అనుకున్నవన్నీ జరుగవు. తను ఎల్లా పుట్టాడో అల్లాగే ఒంటరిగా జీవితరంగంలో తెరనెత్తాడు. హిః హిః హిః భూమి బ్రద్దలయ్యింది. అరుగో... నా జీజీ.. నా పాపా"

దాదా మళ్లా అడ్డుతగిలాడు.

"నువ్వుజీవితం శాశ్వతం కాదని తెలిసి కూడా యింకా తిరిగిరాని ఒక పదార్థంకోసం ఎందుకు వెనక ముందు చూడడం?"

దాసు గుండెల్ని బాదుకున్నాడు. తల పీలికలై పోయేట్టు నేలకి బరువుగా కొట్టుకున్నాడు. దాదా! నీకు నా రోదనలో భౌతికవాదం తప్ప యింకేమీ కనుపించటం లేదు. మేఘాలు మాత్రమే సత్యమని, దాని వెనక్కాలనుండే మహత్తర సిద్ధాంతాల్ని నమ్మటంలేదు నువ్వు. కాదు దాదా! మేఘాలఅవతల అనంతమయినవిశ్వం తెల్లగా మెరుస్తూవుంటుంది. ఏ జాగృతిలో మృత్యువు పిలుపు యదార్థంగా వింటామో ఆ మృత్యువుకాదు. నా జీజీని మింగేసింది! అభివృద్ధిలా కనుపించే అభివృద్ధి నిరోధకంలో ఉద్భవించిన యీ ప్రళయంలో బాంబుల వర్షంలో బ్రద్దలయిన భూమిలో, మంటలుగ పొగలా! మసిలో నుసిలా మాడిపోయారు దాదా— అందుకోసందాదా— నా ఏడుపు— నా రోదన—"

దాదా మళ్ళా అందుకున్నాడు.

"విశ్వసించాను దాసూ. నీ బాధల బరువు, నీ జీజీకోసం నువ్వెలా కోరుతున్నావో, అల్లాగే వాళ్లూ దేశాలకోసం, సామ్రాజ్యాలకోసం, నూనెకోసం, బియ్యంకోసం, బాంబులతో వస్తున్నారు. ఫిరంగులతో వస్తున్నారు. యుద్ధాలు చేస్తారు. కోరికలు కష్టాల్ని త్యజిస్తాయి. వారు చనిపోతేనే కాని దేశాలు బాగుపడవు. యుద్ధాలు నశించవు. నీ కోరిక నీకోసం ఒక మంచి క్రియకోసం. వాళ్ళ కోరికలు మూర్ఖపుది, ఎంతున్నా వాళ్ళకి చాలదు. సోదర మానవుల్ని కష్టపెట్టడంకోసం వాళ్లు యుద్ధాలు చేస్తారు. దాసూ! నీ బాధల్లోవుండే సత్యాన్ని చవిచూసాను. మనం త్వరగా పోదాం రా! అదుగో— వాళ్ళు వస్తున్నారు—బంగారంపండే భారతదేశపు ఆఖరికొండలు అవిగో —రా"

దాసూ మళ్ళా పలవరించాడు.

"ప్రభుత్వాలు మనకోసం వుండాలి. మనకోసం, మన ప్రజలకోసం, ప్రభుత్వాలుండాలి. చాలు. చాలు. మన ప్రభుత్వాలు చాలా బాగా పాలిస్తాయి. నేను రాను. భారతదేశంలో అడుగుపెట్టాను. కరువు కాటకాలు వర్తిస్తూంటే ఆ పుణ్యక్షేత్రంలో అడుగుపెట్టను. ఏ క్షేత్రంలో నా పాపా, నా జీజీ అడుగారిపోయారో, ఏ చోటలో వారి రూపులు సమసిపోయాయో, అల్లాంటి క్షుద్ర భూమిలో, యీ పైశాచిక విద్వేషంలో యిక్కడే వుంటాను. నువ్వు వెళ్ళిపో దాదా, మీ కోరిక మంచిది. కాని ఒక్క సందేశం. నాలా పొట్టకోసం మాతృదేశాన్ని వదిలేట్టు చెయ్యకండి దేశాన్ని. భారతదేశంలో అడుగుంచండి. విప్లవంలోనే, క్రాంతిలోనే నాకు విశ్వాసం వుంది. నా హృదయపు వేదనపై విప్లవం తెస్తేనేగాని నేను మనిషిని కాలేను. మీరు వెళ్ళండి. హిః హిః హిః... నా జీజీ, నా పాపా, అదుగో—అదుగో— ..."

దాదా అనుకున్నాడు. ఏది మిథ్య? జీవితం మిథ్య.

దాసు అనుకున్నాడు. ఏది శాశ్వతం?

దాసు పరుగులు పెట్టాడు. దాదా నివారించేడు. దాసు కనుపించని శూన్యంలోకి నిర్గమించాడు. ఆతని రోదనలు ప్రళయమయ్యాయి!

దాదా అతనికోసం వెదకలేదు. దారి పొడుగునా మెరుపుల్లో కనిపించే శవాల పచ్చివాసనల్లో, ఎముకల-కలకలల్లో, జీవవిహీనమయిన ఆ ప్రకృతిలో, ఆ శూన్యంలో, ఆ చీకటిలో భారతదేశంపై నడిచాడు. ఇంకా నడవాలి. ఇంకా నడవాలి. ఎంత దూరం అది!